
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శుక్రవారం 6 డిసెంబరు 2024 | 5



నల్లజర్లలో పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి

ఓటింగ్ ఇలా.. ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఆరు జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ శాతం ఇలా నమోదైంది.

జిల్లా	కేంద్రాలు	ఓట్లు	పోలైనవి	శాతం
అల్లూరి	12	637	565	88.70
తూర్పు	20	2990	2753	92.07
ఏలూరు	20	2667	2444	91.64
కాకినాడ	22	3418	3118	91.22
కోనసీమ	22	3296	3138	95.21
పశ్చిమ	20	3729	3484	93.43
మొత్తంగా	116	16737	15502	92.62

92.62%

ఓటెత్తారు!



రాజమహేంద్రవరం తహశీల్దార్ కార్యాలయంలో ఓటేసేందుకు ఉపాధ్యాయుల క్యూ

రాజమహేంద్రవరంలో ఓటేసిన టీచర్లు

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

ఓటు విలువ తెలిసినోళ్లు.. తమకు నచ్చిన.. తాము మెచ్చిన నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటెత్తారు.. జరిగేది ఉప ఎన్నికైనా ఎక్కడా వెనక్కి తగ్గలేదు.. తాయిలాల్లేకున్నా.. గిఫ్ట్ బాక్సులు ఇవ్వకున్నా.. పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు.. 60 శాతం.. 70 శాతం కాదు.. ఒక దశలో నూరుశాతం ఓటింగ్ ఉంటుందా అనేటంతగా క్యూకట్టారు.. చివరికి ఆరు జిల్లాల పరిధిలో 92.62 శాతం మంది బ్యాలెట్ ఓటేశారు.. మరో మూడు రోజుల్లో మా.. స్టారెవరో తేలిపోనుంది.. ఎందుకంటే 9న కౌంటింగ్.. అదే రోజు ఫలితం వెల్లడిస్తారు.. మొత్తం మీద ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ఉపపోరు గురువారం ప్రశాంతంగా ముగిసింది.

కాకినాడలో 91.22 శాతం

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మాస్టార్లు ఓటెత్తారు.. ఓటుకు క్యూకట్టారు. నూరుశాతం దిశగా ఓటింగ్ సాగింది.. ఆరు జిల్లాల పరిధిలో ఎక్కడా ఓటింగ్ తగ్గుముఖం పట లేదు. దూరాన్ని సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. మహిళా ఉపాధ్యాయినులు పోటెత్తారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాల్లో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 16737 మంది ఓటర్లకు 15,502 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరిగింది. కాకినాడ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి ఏఆర్వో ఆధ్వర్యంలో వివిధ పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని నిత్యం పర్యవేక్షించారు. కంట్రోల్ రూమ్ నుంచి ప్రతి రెండు గంటలకు ఓటింగ్ శాతం విడుదల చేశారు. ఎన్నికల సందర్భంగా కాకినాడ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కాకి నాడ జేఎన్‌టీయూలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. అన్ని జిల్లాల నుంచి గురువారం రాత్రి స్ట్రాంగ్‌రూమ్‌కు బ్యాలెట్ బాక్సులు చేరుకున్నాయి. పోలింగ్ సిబ్బంది నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకునేందుకు ప్రత్యేక రిసెప్షన్ కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి కాకినాడ జేఎన్‌టీయూలో ఈనెల 9వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అదే రోజు సాయంత్రానికి ఫలితాలను వెల్లడిస్తారు. ఐదుగురు అభ్యర్థులు పోటీపడుతుండగా, విజేత ఎవరో తేలిపోతుంది. 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగుస్తుంది.



- ఎక్కడికక్కడ క్యూకట్టిన టీచర్లు
- ఉత్సాహంగా బ్యాలెట్ ఓటు
- ఆరు జిల్లాల పరిధిలో ఇదే సీన్
- 116 కేంద్రాల్లో పోలింగ్
- బరిలో ఐదుగురు అభ్యర్థులు
- కోనసీమలో అత్యధిక ఓటింగ్
- అల్లూరి జిల్లాలో అత్యల్పం
- కాకినాడలో కంట్రోల్ రూమ్‌లు
- జేఎన్‌టీయూలో స్ట్రాంగ్ రూమ్
- రాత్రికే తరలిన బాక్సులు
- 9న కౌంటింగ్.. ఫలితం
- 12 వరకూ ఎన్నికల కోడ్



కాకినాడలో ఓటేస్తున్న ఉపాధ్యాయుడు



అమలాపురంలో ఓటేస్తున్న టీచర్

తూర్పున 92.07 శాతం

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లాలో 92.07 శాతం ఓట్లు పోలయ్యాయి. జిల్లాలో మొత్తం 2990 మంది ఓటర్లు ఉండగా 2753 మంది ఓటేశారు. 237 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. ఉదయం 10 గంటలకు 20.90 శాతం, 12 గంటలకు 51.70 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 74.28 శాతం, సాయంత్రం 4 గంటలకు 90.54 శాతం పోలైంది. మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కొంత మంది టీచర్లు ఓటు హక్కు వినియోగించుకోలేదు. ప్రభుత్వ ఉపాధ్యాయులంతా ఓటు హక్కు వినియోగించుకున్నట్టు చెబుతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసేవారే కొంతమంది రాలేదనేది సమాచారం.జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను రాజమహేం ద్రవరం ఆర్ట్స్ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.వీటిని జిల్లా రెవిన్యూ అధికారి (డీఆర్వో) టి.సీతారామమూర్తి,ఆర్డీవోలు ఆర్. కృష్ణనాయక్,రాణి సుస్మిత, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ దేవి తదితరులు పర్యవేక్షించారు. ఎన్నికల పరిశీలకుడు కె.హర్షవర్ధన్ స్ట్రాం గ్ రూమ్ ఇక్కడ భద్రత ఏర్పాట్లను పరి శీలించారు.నల్లజర్లలో పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి పరిశీలించారు.



రాజమహేంద్రవరంలో పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్



3 ఓట్లు.. 150 కి.మీ

వై.రామవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం ఎగువ ప్రాంతమైన డొంకరాయి 6వ నెంబరు పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడే ఓట్లు ఉన్నాయి. వై.రామవరం నుంచి ఎన్నికల నిర్వహణ సిబ్బంది 150 కిలోమీటర్లు తరలివెళ్లి పోలింగ్ నిర్వహించారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారని జోనల్ అధికారి బాపన్నదొర చెప్పారు.



కోనసీమలో 95.21 శాతం

అమలాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. 22 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచే ఓటింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. 95.21 శాతం మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావు తెలిపారు. ఉదయం పోలింగ్ ప్రక్రియ మందకొడిగా ప్రారంభమైనప్పటికీ మధ్యాహ్నానికి ఊపందుకుంది. జిల్లాలో 3296 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 3138 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 158 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 2165 మంది పురుష ఓటర్లకు 2060 మంది, 1131 మంది మహిళా ఓటర్లకు 1078 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 95.21 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 60లో అత్యధికంగా 606 మంది ఓటర్లు ఉండగా 574 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 94.72 శాతం నమోదైంది.



కాకినాడలో ఓటేస్తున్న టీచరమ్మ



కొవ్వూరులో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఆర్డీవో రాణిసుస్మిత



పిఠాపురంలో కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో మాట్లాడుతున్న ఎన్నికల ప్రత్యేకాధికారి హర్షవర్ధన్



రాజమహేంద్రవరంలో పోలింగ్ సామగ్రి అప్పగిస్తున్న సిబ్బంది

డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం సిబ్బంది అవినీతిపై కొనసాగుతున్న విచారణ

ముమ్మిడివరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, వైద్య సిబ్బంది నుంచి ముమ్మిడివరం డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని వైద్యశాఖ వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేయడంపై విచారణ కొనసాగుతోంది. బుధవారం కొంతమంది వైద్యుల నుంచి విచారణ అధికారిగా ఉన్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బీవీవీ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో దుర్గారావుదొర లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎల్.శ్రీధర్, మరికొంత మంది సిబ్బంది, వైద్యులు, వైద్య సిబ్బంది నుంచి లీవ్‌లు మంజూరు, మెటర్నటీ లీవ్‌లు, సరెండర్ లీవ్‌లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటి విషయాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు వైద్యులు, వైద్య సిబ్బంది ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై లిఖిత పూర్వకమైన ఫిర్యాదు చేసిన 25 మంది వైద్యాధికారులు, వైద్యులను శుక్రవారం ముమ్మిడివరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణకు హాజరు కావాల్సిందిగా విచారణాధికారి బీవీవీ సత్యనారాయణ నోటీసులు ఇచ్చారు. అలాగే జిల్లాలో పనిచేస్తున్న మరో 22 మంది వైద్య సిబ్బందిని 7వ తేదీన విచారణకు హాజరు కావాల్సిందిగా వారికి నోటీసులు జారీ చేశారు. 6, 7 తేదీల్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన వైద్యులు, వైద్య సిబ్బందిని విచారణాధికారి బీవీవీ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో దుర్గారావుదొర విచారణ నిర్వహించనున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

రైతులకు జాయింట్ కలెక్టర్ నిషాంతి సూచన

అమలాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుని గిట్టుబాటు ధర పొందాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పిలుపునిచ్చారు. అమరావతి నుంచి అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అనంతరం జేసీ మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తేమ శాతం అటూఇటూ ఉన్నా ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించామన్నారు. రైతులే మిల్లర్లను ఎంచుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. యాంత్రిక నూర్పిళ్ల వల్ల 60 శాతం పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు. రైసుమిల్లుల్లో ధాన్యాన్ని ఆరబెట్టే డ్రయర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ బాలసరస్వతి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.ఉదయభాస్కర్ పాల్గొన్నారు.



రారండోయ్ బడి పండక్కి..

రేపు జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్

- అమ్మానాన్నలకు ప్రత్యేక ఆహ్వానాలు
- తల్లిదండ్రులు, గురువులు ఒకే వేదికపై
- పాఠశాలల అభివృద్ధిపై దిశానిర్దేశం
- సహపంక్తి భోజనాలు, వివిధ పోటీలు

అమలాపురం రూరల్/ మండపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధితో పాటు పిల్లల బంగారు భవిష్యత్తు కోసం.. బడివైపు ఒక్క అడుగు నినాదంతో కూటమి ప్రభుత్వం తొలిసారిగా మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ (ఉపాధ్యాయులు-తల్లిదండ్రుల) నిర్వహించనుంది. వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం తొలి అడుగు వేసింది. పాఠశాలలకు పూర్వ వైభవం తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలలకు, తల్లిదండ్రులకు, సమాజానికి మధ్య పటిష్టమైన, సుసంపన్నమైన బంధాన్ని ఏర్పరిచేందుకు ప్రభుత్వం సమావేశాలను ఏర్పాటు చేసింది. డిసెంబరు 7న బడివైపు ఒక్క అడుగు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించారు. పాఠశాలల్లో జరిగే సమావేశాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనేందుకు వీలుగా ప్రత్యేక కార్యాచరణను జిల్లా విద్యాశాఖ చేపట్టింది. విద్యాపరమైన అంశాలను చర్చించడంతో పాటు ఆట పాటలు, సహపంక్తి భోజనాలు, పిల్లల ప్రగతి నివేదికలు ఈ సమావేశంలో అందజేయనున్నారు. ఈ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు సమగ్ర శిక్షాభియాన్ ఆధ్వర్యంలో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

క్రమశిక్షణను అలవర్చడమే లక్ష్యం



క్రమశిక్షణ కలిగిన విద్యార్థులుగా పిల్లలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా బడివైపు ఒక అడుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. విద్యార్థుల తల్లిదండ్రులతో ఆ రోజున జరిగే సమావేశాల్లో చర్చిస్తారు. ఇంటి వద్ద విద్యార్థుల వ్యవహార శైలిని తెలుసుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. పాఠశాలల్లో లోపాలను గుర్తించి వాటిని అధిగమించే విధంగా చర్యలు తీసుకుంటారు. విద్యార్థుల గురించి తల్లిదండ్రులకు సాధ్యమైనంత వరకు ఉపాధ్యాయులు పాజిటివ్‌గానే చెప్పాలి. నెగిటివ్స్ ఉంటే నెమ్మదిగా చెప్పాలి. ఇళ్ల వద్ద విద్యార్థులు సెల్‌ఫోన్, ట్యాబ్స్ వంటి వినియోగాన్ని తగ్గించేలా తల్లిదండ్రులకు చెప్పాలి. సమావేశాల్లో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. పాఠశాలల్లో జరిగే అభివృద్ధి పనుల్లో తల్లిదండ్రులను భాగస్వాములు చేస్తాం..

షేక్ సలీంబాషా, జిల్లా విద్యాశాఖాధికారి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

1582 పాఠశాలల్లో ఏకకాలంలో సమావేశాలు

అమలాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఈ నెల 7న జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ మీట్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 1582 పాఠశాలల్లో ఏక కాలంలో ఈ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ అమరావతి నుంచి గురువారం కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ మెగా సమావేశాల సన్నద్ధత విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు సంబంధిత పాఠశాలల్లో చదివిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యుల, స్థలదాతలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల కంటే ఉత్తమంగాప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే సంకల్పంతో మెగా మీట్ నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులకు వినోదాత్మక పోటీలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 1225 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, 51 మున్సిపల్ పాఠశాలలు, 69 ప్రాథమికోన్నత పాఠశాలలు, 237 ఉన్నత పాఠశాలల్లో మెగా మీట్ నిర్వహిస్తామన్నారు. ఆయా పాఠశాలల్లో 97,712 మంది విద్యార్థులుండగా వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా మెగా మీట్‌కు ఆహ్వానిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

అజెండాలోని అంశాలు

డిసెంబరు 7 ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తారు. రెండు రోజులు ముందుగానే తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలను అందించడంతో పాటు సమావేశం రోజున విధిగా హాజరయ్యేలా వారికి వివరిస్తారు. నిర్దేశించిన షెడ్యూల్‌కు అనుగుణంగా తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు సమావేశమై పలు సూచనలు చేస్తారు. విద్యార్థుల తల్లులకు రంగోళీ, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలి. పాఠశాల నివేదికను ప్రధానోపాధ్యాయుడు తల్లిదండ్రులకు వివరించాలి. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, సభ్యులు, తల్లుల ప్రసంగాలకు ప్రధానంగా అవకాశం కల్పించాలి. వారిచ్చే సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకోవాలి. మధ్యాహ్నం 1 గంటకు అందరికీ భోజనాలు ఏర్పాటు చేస్తారు.



వన్నెచింతలపూడి పాఠశాలలో ఏర్పాట్లు



కర్పూర ధర పతనం

అరటి రైతుల ఆవేదన

రావులపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత పది రోజులు ముందు వరకు కర్పూర ధరకు ఆశించిన ధర ఉండేది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేసేవారు అయితే ఇప్పుడు ఒక్కసారిగా ధర పతనమవ్వడంతో అరటి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా శీతాకాలం ప్రవేశించగానే గెలల దిగుబడి ఉన్నప్పటికీ ఆశించిన ధర పలికే పరిస్థితి లేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ముహూర్తాలు లేకపోవడం కొంత మేర ఎగుమతులు తగ్గడంతో అరటి గెలలకు డిమాండ్ తగ్గింది. గతంలో ఆరు గెలల అరటి లోడు సైకిల్ రూ.1800 నుంచి రూ.2400 ఉండేది. ప్రస్తుతం అవే గెలలు రూ.600 నుంచి రూ.1200 వరకు మాత్రమే పలుకుతుండటంతో సైకిల్‌పై లోడు తొక్కే కిరాయి ఖర్చులు కూడా రావడం లేదంటూ రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం అరటి మార్కెట్ యార్డుకు 6 వేల నుంచి 7 వేలు కర్పూర రకం అరటి గెలలు రైతులు మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. ఈ సీజన్‌లో ఇతర ప్రాంతాలలో కర్పూర రకం వినియోగం తక్కువగా ఉండటంతో ధర భారీగా తగ్గిందని పలువురు పేర్కొంటున్నారు.



ఏ.వేమవరంలో షష్ఠి ప్రత్యేకత 6లో

కార్తీక మాసంలో అంతర్వేది ఆదాయం రూ.1,16,11,590 వార్త..7లో

బాలిక అదృశ్యమా..? కిడ్నాపా? 7లో

'నన్నయ'లో 9న బీఈడీ స్పాట్ అడ్మిషన్లు వార్త..7లో

సుబ్రహ్మణ్యా నమోస్తుతే!!

ఆకాశమంత భక్తి... ఎ.వేమవరంలో 42 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం

కరప-పెనుగుదురు రోడ్డులో కోరుపల్లి వద్ద 51 అడుగుల అతి పెద్ద విగ్రహం

షష్ఠి ఉత్సవాలకు ముస్తాబైన బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడు

తాటిపర్తి, మల్లవరంల్లోనూ పూర్తయిన ఏర్పాట్లు.. రేపే షష్ఠి పండుగ

శనివారం జరిగే సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలకు ఆయా ఆలయాలన్నీ ముస్తాబు అయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలెన్నో ప్రసిద్ధి చెందినవి ఉన్నాయి. ఇందులో ప్రధానంగా బిక్కవోలులోని శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం అతి పురాతనమైంది. పంచారామాలకంటే ముందు ఈ ఆలయాన్ని నిర్మించారని చరిత్ర కథనం. ఇక అమలాపురం మండలం ఎ.వేమవరం గ్రామంలో అతి పెద్ద సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల్లో ఒకటిగా 42 అడుగులతో దర్శనమిస్తోంది. అలాగే కరప సమీపంలో 51 అడుగుల మరో విగ్రహం ఉంది. వీటితోపాటు గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి, ఆలవెల్లి మల్లవరంలలో ఉన్న ఆలయాలు స్వయంభూ కావడంతో ప్రసిద్ధ క్షేత్రాలుగా వెలుగొందుతున్నాయి. ఆ విశేషాలు ఇవీ...





ఎ.వేమవరంలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం.. కరపలో 51అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం

మలేషియా తరహాలో ఎ.వేమవరంలోనూ..

నేడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



ఎ.వేమవరంలో కొలువుదీరిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

అమలాపురం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి అతిపెద్ద విగ్రహాల్లో ఒకటి అమలాపురం మండలం ఎ.వేమవరం గ్రామంలో ఉంది. ఇందులో 42 అడుగుల ఎత్తులో ఉన్న ఈ విగ్రహాన్ని మలేషియా తరహాలో ఇక్కడ నిర్మించినట్టు ఆలయ వ్యవస్థాపకులు తెలిపారు. స్వామివారికి రక్షణ పడగగా 45 అడుగుల నాగరాజు నిలబడి ఉండడం మరో విశేషం. ఎ.వేమవరంలో ప్రసిద్ధినొందిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి 6.30 గంటలకు గూడా సత్యహరిశ్చంద్రుడు కుటుంబీకుల ఆధ్వర్యంలో స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. 85 ఏళ్ల కిందట నిర్మించిన ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. దేవస్థానం చైర్మన్ కొంపెల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామికల్యాణోత్సవాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

బ్రహ్మజాతి దేవతాసర్పం సంచారం..

ఎ.వేమవరంలో ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రాంతంలో పెద్ద పాముల పుట్ట ఉండేది. ఆ ప్రాంతంలో బ్రహ్మజాతి దేవతాసర్పం సంచరిస్తూ ఉండేదని నాటి పూర్వీకులు నేటికీ చెబుతున్నారు. ఆ పుట్టపై పంచ శిరస్సుల సర్పాకృతితో ఒక గుమ్మడిపాదు పెరిగింది. పశ్చిమాభిముఖంగా గుమ్మడి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వెలిసినట్టు అక్కడే ఆలయాన్ని నిర్మించమని ఓ భక్తురాలికి కలలో కనిపించి చెప్పినట్టు కథనం. స్థలదాత, సీనియర్ న్యాయవాది దివంగత గూడా సత్యహరిశ్చంద్రుడు భక్తురాలి కలను నిజం చేస్తూ ఆలయాన్ని నిర్మించారు. సంతాన సుబ్రహ్మణ్యేశ్వరునిగా, గుమ్మడి సుబ్రహ్మణ్యేశ్వరునిగా ఈ ఆలయం ప్రసిద్ధినొందింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం అనంతరం 7న షష్ఠితీర్థం జరుగుతుంది.

కరపలో 51 అడుగుల విగ్రహం

కరప, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని కరప-పెనుగుదురు ప్రధాన రహదారిలో కోరుపల్లి పరిధిలో ఉన్న 51 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంటుంది. ఇక్కడ జనసేన నేతలు చిక్కాల దొరబాబు, సుబ్బారావు ఆధ్వర్యంలో షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లుచేశారు. అదేవిధంగా కరపలో చాగంటి వంశీకులు నిర్మించిన ఆలయంలో ధర్మకర్త చాగంటి వెంకట్రావు, వేళంగిలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో షష్ఠి వేడుకలు అట్టహాసంగా జరగనున్నాయి.





సహజసిద్ధమైన పుట్టతో దర్శనమిస్తున్న బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సంతానాన్నిచ్చే బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడు సంతానం లేని స్త్రీలకు సంతాన్నిచ్చే స్వామిగా ప్రసిద్ధికెక్కాడు. ఈ స్వామికి మార్గశిర శుద్ధ షష్ఠి రోజున స్వామివారి షష్ఠి మహోత్సవాన్ని వైభవంగా ఏళ్ల తరబడి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఈ నెల 6 నుంచి 12 వరకూ షష్ఠి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. షష్ఠి ఉత్సవాన్ని 7న నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ చరిత్ర చూస్తే.. ఈ ఆలయాన్ని పంచారామాలకంటే 300ఏళ్ల ముందే తూర్పు చాళుక్యులు నిర్మించగా 1100 ఏళ్ల చరిత్రను కలిగి ఉంది. ఈ క్షేత్రాన్ని మొదట తూర్పు చాళుక్య విజయాదిత్యుని కాలంలో విక్రమపురంగాను, మూడో విజయాదిత్యుడిగా పేరొందిన గుణగవిజయాదిత్యుని కాలంలో బిరుదాంకినవోలుగాను, ఆపై కాలక్రమేణా బిక్కవోలుగా నామాంతరం చెందింది. ఈ ఆలయంలో శైవ కుటుంబం మొత్తం కొలువై ఉండడం ఈ దేవాలయ ప్రత్యేకత. దీనికి మధ్యలో గోలింగేశ్వరుడు, పార్వతి అమ్మవారు, లక్ష్మీగణపతి, భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరుడు, సహజమైన పుట్టతో శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉన్నారు. గోలింగేశ్వరస్వామి ఆలయానికి ఎడమవైపు బాలాత్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి, కుడివైపు రాజరాజేశ్వరీదేవి సమేత రాజరాజేశ్వరస్వామివారి ఆలయాలు ఉన్నాయి. దీంతో త్రిలింగ క్షేత్రంగా కూడా పేరొందింది.

సుబ్రహ్మణ్యస్వామి చరిత్ర..

తూర్పుగోదావరి జిల్లాలోని బిక్కవోలులో శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వస్వామి సహజమైన పుట్టతో దర్శనమిస్తారు. సంతానం లేని స్త్రీలకు సంతాన ప్రాప్తినిచ్చే స్వామిగా పేరొందాడు. తమిళనాడులోని పళనిలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిలా దక్షిణాభిముఖంగా ఈ స్వామి భక్తులకు దర్శనమిస్తూ ఉండడంతో బిక్కవోలు గ్రామం కూడా కుమారక్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది. స్వామికి ఇష్టమైన మంగళవారం, శుద్ధ షష్ఠి, కృత్తికా నక్షత్రం రోజుల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాహు, కేతు, కుజ, సర్ప దోష నివారణార్థం భక్తులతో పూజలు చేయిస్తుంటారు. మిగిలిన రోజుల్లో స్వామివారి వద్ద ఉన్న సర్పానికి పూజలు చేయడం ఇక్కడ ప్రత్యేకత. సంతానం లేని స్త్రీలు షష్ఠి రోజున స్వామి చెంతనే ఉన్న సహజపుట్టపై నాగులచీర ఉంచి దాన్ని ధరించి ఆలయం వెనుక శయనిస్తే సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం.

బాణసంచా ప్రత్యేక ఆకర్షణ

షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీ రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు కాల్చే బాణసంచా ప్రత్యేక ఆకర్షణ.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఈనెల 7న నిర్వహించే సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జేవీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాలకు రూ.80 లక్షల వరకూ వ్యయం చేయనున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి రూ.లక్షకుపైగా భక్తులు స్వామి దర్శనానికి వస్తారని, వీరందరికీ స్వామి దర్శనాలు కల్పించడానికి భారీ క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, 12న మహాన్నదానంతో ఉత్సవాలను ముగిస్తామని చెప్పారు.





తాటిపర్తిలో వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పక్కన స్వామి నిజరూప దర్శనం (ఫైల్)





ఆలవెల్లి మల్లవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పక్కన స్వామి నిజరూప దర్శనం

స్వయంభూగా వెలసి.. వరాలిస్తూ..

గొల్లప్రోలురూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠికి ఆలయాలు ముస్తాబయ్యాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి, ఏపీ మల్లవరం గ్రామాల్లో స్వయంభూగా వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ఈనెల 7 నుంచి షష్ఠి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయాలు ముందు సంప్రదాయబద్ధంగా పందిర్లు వేశారు. విద్యుత్‌దీపాలతో అలంకరించారు. తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లో ఉన్న వారి గృహాలకు వివిధ ప్రాంతాల నుంచి బంధువుల రాక ఇప్పటికే ప్రారంభమైంది.

తాటిపర్తి క్షేత్రప్రాశస్త్యం

గొల్లప్రోలు మండలంలో తాటిపర్తి గ్రామంలో వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్వయంభూగా వెలిశారు. ఇక్కడ ఉన్న స్వామి విగ్రహంవద్ద పాము కొంతకాలంపాటు ఉండి అక్కడే చనిపోవడంతో ఆ స్థానంలో ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడికి సమీపంలోనే అపర్ణాసమేత నాగేశ్వరస్వామి ఆలయం ఉండడంతో మరింత ప్రాశస్త్యం లభించింది. సంతాన ప్రాప్తికి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో ఎరుపురంగు చారల చీర కట్టుకుని రాత్రంతా నిద్రిస్తే మంచిదని భక్తుల నమ్మిక. ఈ వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 87వ షష్ఠి బ్రహ్మోత్సవాలు ఈనెల 7న ప్రారంభమై 12 వరకూ జరుగుతాయి. శనివారం తెల్లవారుజామున స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనం, రాత్రి శూలాల సంబరం, చెట్టుభజన, తాడిపెద్దు సంబరం జరుగుతాయి. అనంతరం స్వామి కల్యాణం జరుగుతుంది. 11న స్వామి గ్రామోత్సవం, 12న స్వామి షట్ సహస్ర నామార్చన, రాత్రి పుష్కరిణిలో తెప్పోత్సవం జరుగుతాయి. 6న స్వామి, అమ్మవార్లకు పెండ్లి కుమారుడు, కుమార్తె అలంకారం, అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహిస్తారు.

ఆలవెల్లి మల్లవరం విశిష్ఠత..

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యక్షంగా దర్శనమిచ్చిన క్షేత్రమిది. సర్పరూపంలో భక్తులకు దర్శనమివ్వగా అక్కడే ఆలయాన్ని నిర్మించారు. 1961-64 సంవత్సరాల మధ్య ఆలవెల్లి మల్లవరంలోని పంటపొలాల్లో సర్పం రైతులకు కనిపించి కదలకుండా ఉండిపోయింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యక్షంగా కనిపించాడని భావించిన ప్రజలు పూజలు నిర్వహించి అక్కడే ఆలయం నిర్మించారు. వీరచోళ చతుర్వేద మండలం ఆలవెల్లి నిలయ మల్లవరం క్షేత్రం స్వామి కళ్యాణమహోత్సవాలు 7 నుంచి 11 వరకూ జరగనున్నాయి. 13న కల్యాణవేదిక పైఅంతస్తును ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రారంభిస్తారు.



అష్ట లక్ష్మీ సమేత వాహనంపై ఊరేగుతున్న స్వామివార్లు

వైభవంగా అనపర్తిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావడి ఉత్సవం

అనపర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): షష్ఠి వేడుకల సందర్భంగా అనపర్తిలోని వీర్రాజు మామిడి వద్ద కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావడి ఉత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాన్ని ప్రారంభించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఊరేగిస్తూ కావడి ధరించిన మాలధారులు సంతానం లేని మహిళలను దాటుతూ వారికి సంతాన ప్రాప్తి కలగాలని దీవించారు. ఇలా చేస్తే సంతానం కలుగుతుందని ఇక్కడి భక్తులు విశ్వసిస్తారు. రథానికి గ్రామంలో భక్తులు నీరాజనాలు పలికారు. కావడి ధరించిన భక్తులకు పసుపు నీళ్లతో అభిషేకాలు చేశారు. అనపర్తిలో పదకొండేళ్లుగా కావడి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారని ఆలయార్చకుడు చందూశర్మ తెలిపారు. ఉత్సవంలో కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు వోగిరెడ్డి సత్తిరెడ్డి, మండ పోతారెడ్డి, మండ రామారెడ్డి, కర్రి సుధాకరరెడ్డి, తమలంపూడి వీర్రాఘవరెడ్డి, వెలగల గంగిరెడ్డి, బూరయ్య పర్యవేక్షించారు.





సంతానం కోసం ఆలయంలో కావడి ధరించిన మాలధారులు స్త్రీలపై దాటుతూ ఆశీర్వదిస్తున్న దీక్షాధారులు.. కావడి మోస్తున్న సీడీఆర్ ఆసుపత్రి వైద్యురాలు కర్రి బాంధవి



వేగ జ్యూయలర్స్‌ను ప్రారంభించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ



బాలకృష్ణ, సంయుక్త మీనన్‌లను చూడ్డానికి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు, (ఇన్‌సెట్లో) వేగ జ్యూయలర్స్ షోరూం

కాకినాడలో వేగ జ్యూయలర్స్

షోరూమ్‌ను ప్రారంభించిన ప్రముఖ సినీ నటుడు బాలకృష్ణ

హాజరైన సినీ నటి సంయుక్త మీనన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నమ్మకం, నాణ్యత ఆభరణాలుగా ఎన్నో ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రజల విశ్వాసం చూరగొన్న వేగ జ్యూయలర్స్ నాలుగో షోరూమ్ కాకినాడ బాలాజీచెరువు సెంటర్‌లో గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన వేగ జ్యూయలర్స్ బ్రాండ్ అంబాసిడర్, సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ప్రముఖ సినీ తార సంయుక్త మీనన్‌తో కలిసి షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ పుట్టిన రోజు నుంచి ప్రతిరోజు వేడుకలకు అమ్మాయికి కొనుగోలు చేసే బంగారం విలువ ఆమె వయసుతో పాటు పెరుగుతూ వస్తుందన్నారు. బంగారం అంటే ఖర్చు మాత్రమే కాదని అది భవిష్యత్తు తరాలకు సంపదన్నారు. ఇక్కడ ఒక రకం మోడల్ చూపించమంటే వంద రకాల మోడల్స్ చూపిస్తున్నారని నటి సంయుక్త మీనన్ సంతోషంగా అన్నారు. షోరూమ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన బాలకృష్ణ, సంయుక్త మీనన్‌లను చూసేందుకు భారీ స్థాయిలో ప్రేక్షకులు విచ్చేశారు. సంస్థ యాజమాన్య ప్రతినిధులు వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా తమ వేగ జ్యూయలర్స్ ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన బంగారు ఆభరణాలు అందిస్తూ వారి విశ్వాసం పొందాయన్నారు. నూతన షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 12వ తేదీ వరకు ప్రజలకు ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్టు ప్రకటించారు. ప్రతి ఆభరణం పైన వీఏ 4.99శాతం నుంచి 11.99శాతం వరకు ఉంటుందన్నారు. బీఐఎస్ హాల్‌మార్క్ బంగారు ఆభరణాలు సర్టిఫికెట్ తోటి డైమాండ్స్ క్యారట్ ధర రూ.50,999 మాత్రమేనన్నారు. తమ షోరూమ్‌లో సంప్రదాయ ఆభరణాల నుంచి ఆధునిక ఫ్యాషన్ ఆభరణాల వరకు... చిన్న కాసు నుంచి భారీ వడ్డాణాల వరకు, ముక్కుపుడక నుంచి ముత్యాల హారాలు వరకు లభిస్తాయన్నారు. ఎన్నో రకాల ఉంగరాలు, చెవి దుద్దులు, గాజులు, నెక్లెస్‌లు, బ్రాస్‌లెట్స్ అందిస్తున్నామన్నారు. వధువు ధరించే ఆభరణాల నుంచి రోజూ ధరించే ఫ్యాన్సీ ఆభరణాల వరకు, వివాహాల కోసం బహుమతిగా ఇవ్వడం కోసమైనా.... ఇంట్లో జరిగే వేడుక ఏదైనా 'వేగ' తోడుంటే అది మరపురాని మధురానుభూతిని కలకాలం నిలుపుతుందన్నారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు అమన్‌జైన్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

రంపచోడవరం, చింతూరు డివిజన్లలో 88.70 శాతం పోలింగ్

రంపచోడవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు మన్యంలో ప్రశాంత వాతావరణంలో జరిగాయని రంపచోడవరం సబ్ కలెక్టరు, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కేఆర్ కల్పశ్రీ తెలిపారు. చింతూరు, రంపచోడవరం డివిజన్లలో 88.70 శాతం పోలింగ్ జరిగిందన్నారు. 12 పోలింగ్ కేంద్రాల్లో 637 ఓటర్లకు 565 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తెలిపారు. రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని కల్పశ్రీ పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దారు రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్లు సత్యనారాయణ, త్రిమూర్తులు, శ్రీధర్, శివ, ఆర్ఐ జిలాని ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టరు కల్పశ్రీ

8న ఆర్చరీ పోటీలు

పిఠాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 8వ తేదీ ఉదయం 9గంటల నుంచి అమలాపురం సర్ సీవీరామన్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జే ఎస్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. సబ్‌జూనియర్స్ ఆర్చరీ ఇండియన్ రౌండ్, రికర్వ్ కాంపౌండ్ బాలబాలికల విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనేవారు 2007, జనవరి 1 తర్వాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. వివరాలకు 9989001162 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

నన్నయలో 9న బీఈడీ స్పాట్ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్య కళాశాలలో ఈనెల 9న బీఈడీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. బీఈడీ రెండేళ్ల కోర్సుకు బీఏ, బీకామ్, బీఎస్సీ, బీటెక్ డిగ్రీ పూర్తి చేసి ఎడ్‌సెట్-2024 పరీక్ష రాసిన వారు అర్హులన్నారు. విద్యార్థులు ఈనెల 9న ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి ప్రవేశ రుసుం చెల్లించి అడ్మిషన్ పొందవచ్చునన్నారు. వివరాలకు 70930 08473 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఆత్రేయపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం రావడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లికి చెందిన ఎడ్ల నాగఫణీంద్ర(27) పచ్చళ్ల వాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పచ్చళ్ల వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురైన ఫణీంద్ర ఈనెల 3న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గురువారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

కొత్త రేషన్‌కార్డులు.. ఎప్పటినుంచి?

- రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణపై సందిగ్ధత.. స్పష్టత రాని వైనం
- గురువారం రాత్రికి కూడా జారీ కాని మార్గదర్శకాలు
- సచివాలయాలకు వెళ్తున్న అర్హులు
- స్పష్టత లేక తప్పని ఎదురుచూపులు



సామర్లకోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకారంపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం ఈనెల 2వతేదీనుంచి సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరణ ప్రారంభిస్తామని ప్రకటించడంతో ఆశావహులు సంతోషం వ్యక్తం చేశారు. సచివాలయాలకు పెద్దసంఖ్యలో చేరుకుని దరఖాస్తుకు ప్రయత్నిస్తున్నారు. కానీ, సచివాలయాలకు నాలుగురోజులుగా ఇందుకు సంబంధించి యాప్ ఓపెన్ కాకపోవడం, ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు సైతం రాకపోవడంతో ఆశావహులకు ఏం చెప్పాలో తెలియని అయోమయ పరిస్థితిని సచివాలయాల సిబ్బంది సోమవారం నుంచి గురువారం రాత్రి వరకూ ఎదుర్కొన్నారు.

సంక్రాంతికి కొత్త కార్డులంటూ..

డిసెంబరు 2 నుంచి 28 వరకూ అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద కొత్త రేషన్‌కార్డులు, ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించబోతోందని, కొత్త డిజైన్లతో రేషన్‌కార్డుల పంపిణీ చేయ నుందని కొన్నిరోజులుగా అధికార యంత్రాంగం ప్రచారం నిర్వహించింది. సంక్రాంతి పండుగకి కొత్త కార్డులు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని కూడా కొందరు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి గురువారం సాయంత్రం నాటికి కూడా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కాలేదు. దీంతో దరఖాస్తుదారులకు ఏం చెప్పాలో, దరఖాస్తులు స్వీకరించాలో వద్దో తెలియని అయోమయ పరిస్థితిలో గ్రామ, వార్డు సచివాలయాలసిబ్బంది కొట్టుమిట్టాడుతున్నారు.

పది నెలలుగా పెండింగ్

ఇంచుమించు 10నెలలుగా కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల్లో స్వీకరించడంలేదు. ఇందుకు సంబంధించి ఈ-పోస్ సైట్‌ని బ్లాక్ చేశారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వచ్చిన దరఖాస్తులు వందల్లో పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారులు తెలిపారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్‌తో రేషన్ కార్డులకు సంబంధించి ఎలాంటి దరఖాస్తులను స్వీకరించడంలేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడగా వైసీపీ రంగులతో ఉన్న రైస్‌కార్డులను తొలగించాలని నిర్ణయించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన రేషన్‌కార్డుల్లో మొత్తం కుటుంబసభ్యుల ఫొటో ఉండేది. అలానే కుటుంబ పెద్ద, వృత్తి, పుట్టిన తేదీ, వయస్సు, వార్షికాదాయం వంటి వివరాలు ఉండేవి. గత వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించి రైస్‌కార్డులంటూ సచివాలయాల ద్వారా పంపిణీ చేసింది. ఆ కార్డుల్లో కుటుంబ సభ్యుల ఫొటోను తీసేసి కేవలం ఆ కుటుంబంలో మహిళ ఫొటోను మాత్రమే ఉంచింది. ఆ కార్డులను గుర్తింపు కార్డులుగా పరిగణించలేని పరిస్థితి.

దరఖాస్తుదారుల ఎదురుచూపులు

కొత్తకార్డులు, స్ప్లిట్ కార్డులు, ఇతర సవరణల కోసం పెట్టుకున్న దరఖాస్తులను గతప్రభుత్వం నిలిపివేసింది. ఆరంచెల మూల్యాంకనం ద్వారా వేలల్లో కార్డులను తొలగించింది. ఈ కారణంగా ఇప్పుడు వంటగ్యాస్ సబ్సిడీలకు కూడా కొందరు దూరమయ్యారు. ఇతర సంక్షేమ పథకాలను పొందలేకపోయారు. కాకినాడ జిల్లాలో ఇప్పటికే 16లక్షల20వేల కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. మరో 3.30 లక్షల వరకూ కొత్తకార్డులు మంజూరు చేయాలని దరఖాస్తుదారులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఇంకా అర్హులు మిగిలిపోయి ఉండడంతో వారికి కార్డులు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. తగిన మార్గదర్శకాలు రాకపోవడంతో గురువారం సాయంత్రం వరకూ సచివాలయాలకు దరఖాస్తులతో వచ్చేవారు నిరాశగా వెనుదిరుగుతున్నారు. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులను వివరణ కోరేందుకు గురువారం రాత్రి ప్రయత్నించగా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కావడంలో కాస్త ఆలస్యమైందని స్పష్టం చేశారు.



సామర్లకోట భీమేశ్వరాలయంలో హుండీలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

సామర్లకోట భీమేశ్వరాలయ ఆదాయం రూ.కోటి34లక్షలు

సామర్లకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో కార్తీక మాసం పర్వదినాలు పురస్కరించుకుని భక్తుల రాక పెరగడమే గాక ఆలయ ఆదాయం సైతం అనూహ్యంగా పెరిగిందని ఆలయ ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. గురువారం సాయంత్రం వరకూ ఆలయంలోని హుండీలు దేవదాయ అధికారులు, సామర్లకోట భక్త జనావళి మధ్య హుండీలు లెక్కించారు. నెలరోజుల పర్వదినాల్లో భక్తులు ద్వారా ఆలయానికి రూ.1కోటి34 లక్షల24వేల198 సమకూరాయన్నారు. వీటిలో హుండీల ద్వారా రూ.24.19లక్షలు, ప్రసాదాల

- కార్తీకమాసంలో పెరిగిన ఆదాయం

విక్రయాల ద్వారా రూ.15.79లక్షలు, నిత్యాన్నదాన విరాళాల ద్వారా రూ.30.95లక్షలు, వివిధ పూజా రుసుములు, దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.48.42లక్షలు, సేవల టికెట్ల ద్వారా రూ.4.76లక్షలు, ఆన్‌లైన్ విరాళాల ద్వారా రూ.10.02లక్షలు, టెంపుల్ డొనేషన్ల ద్వారా రూ.10వేల15 చొప్పున లభించినట్లు తెలిపారు. గత కార్తీకం ఆదాయంతో పోలిస్తే అదనంగా రూ.31.11లక్షలు లభించినట్లు ఈవో తెలిపారు. దేవదాయ అధికారులు వి.ఫణికుమార్, టీవీ సూర్యనారాయణ, కంటే బాబు పాల్గొన్నారు.

అంతర్వేది లక్ష్మీనరసింహుడి కార్తీకమాసం ఆదాయం రూ.కోటి16లక్షలు

అంతర్వేది, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. కార్తీకమాసం నెలరోజులకు రూ.1,16,11,590 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు. ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.19,37,800, వసతి గదులకు రూ.1,52,437, విరాళాల ద్వారా రూ.84,646, లడ్డూ ప్రసాదానికి రూ.14,25,420, స్వామివారి అభిషేకాలకు రూ.2,58,400, సుదర్శనహోమం ద్వారా రూ.4,37,200, టన్సూర్ ద్వారా రూ.21,250,ఇతర సేవల ద్వారా రూ.52,176, నిత్యాన్నదాన ట్రస్టు ద్వారా రూ.41,12,521, హుండీల ద్వారా రూ.31,29,740, మొత్తం రూ.1,16,11,590 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. స్వామివారి అనుబంధ దేవాలయమైన నీలకంఠేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.45,084 వచ్చినట్టు తెలిపారు. ఎంపీటీసీ భైరా నాగరాజు పాల్గొన్నారు.



హుండీ ఆదాయ లెక్కింపును పరిశీలిస్తున్న ఏసీ సత్యనారాయణ

పిఠాపురం పాదగయకు కార్తీకమాస ఆదాయం రూ.46.72లక్షలు

పిఠాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి కార్తీకమాసంలో రూ.46.72లక్షల ఆదాయం సమకూరింది. అభిషేకాలు, పూజాది రుసుములు, దర్శనం టిక్కెట్లు, ప్రసాద విక్రయాలు, ఇతరత్రా మార్గాల్లో ఈ ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. 2023 కార్తీకమాసంతో పోల్చుకుంటే రూ.9.77లక్షలు ఆదాయం అదనంగా వచ్చిందని చెప్పారు. కార్తీక మాసోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, పురప్రముఖులు, అధికారులు, భక్తులు, సేవా సంఘాల ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. భక్తులకు మరింత మెరుగ్గా సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

బ్యాంక్ యాప్ ద్వారా సైబర్ మోసం

- ఏజెన్సీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో మరో సైబర్ నేరం
- రెండు ఎకౌంట్లో ఉన్న మొత్తం రూ.1.48లక్షలు గల్లంతు

మోతుగూడెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో రోజుకోచోట సైబర్ నేరాలు జరుగుతున్నా కొందరిలో అవగాహన లేక నేరాలు ఆగడంలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతం చింతూరు మండలం మోతుగూడెంలో గురువారం పప్పు చిరంజీవి అనే వ్యక్తి ఉదయం 10.30గంటలకు ఆయనకు ఫోన్ వాట్సాప్‌కు ఓ బ్యాంక్ యాప్‌నకు సంబంధించి నాలుగుసార్లు వాట్సాప్ మెసేజ్ వచ్చాయి. మెసేజ్ ఓపెన్ చేసి చదివే లోపు టకటకమని రెండు ఎకౌంట్లో ఉన్న డబ్బు రూ.1.48లక్షలు గల్లంతయ్యాయి. దీంతో లబోదిబోమంటూ బాధితుడు యూనియన్ బ్యాంక్ వద్దకు వెళ్లి మేనేజర్ విత్తనాల సత్యనారాయణను కలిసి పరిస్థితిని తెలియజేశారు. వెంటనే బ్యాంక్ మేనేజర్ స్పందించి హెడ్ ఆఫీస్ ముంబాయి ఫోన్ చేసి ఖాతాదారు అకౌంట్ హోల్డ్ చేశారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు నుంచి వాట్సాప్ ద్వారా ఎటువంటి సందేశాలు ఖాతాదారులకు పంపరని గుర్తించాలని తెలియజేశారు. ఒకవేళ సైబర్ నేరగాళ్లు ఇటువంటిని ఏమైనా పంపిస్తే అప్రమత్తమై బ్యాంకు వద్దకు వచ్చి తెలియజేయాలని, అనుమానాస్పద మెసేజ్‌ను ఎట్టి పరిస్థితుల్లోను ఓపెన్ చేయకూడదని విజ్ఞప్తి చేశారు. బ్యాంకు సమాచారం ఏదైనా వినియోగదారులకు తెలియపరిస్తే అది మామూలు మెసేజుల ద్వారా సమాచారం వస్తుందని, గుర్తించచాలని తెలియజేశారు. ఈ మధ్యకాలంలో వివిధ రకాల యాప్‌ల ద్వారా సైబర్ మోసాలు ఎక్కువగా ఉన్నాయని, వాటి పట్ల అప్రమత్తమై ఉండాలని బ్యాంకు మేనేజర్ ఖాతాదారులు తెలియజేశారు. గతంలో జరిగిన ఘటనలో ఫోర్ బైలో రూ.75వేలు, పొల్లూరులో రూ.60వేలు, మోతుగూడెంలో రూ.70వేలు ఫోన్ యాప్ ద్వారా పంపి ఇలాంటి సంఘటనల్లో డబ్బులు మోసపోయారని సమాచారం.

ప్లాస్టిక్ సర్జరీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ ప్రారంభం





- 100మందికి పైగా దేశవ్యాప్త ప్లాస్టిక్ సర్జన్లు హాజరు
- రెండు సెషన్లుగా నిర్వహణ
- మృతదేహంపై ప్రయోగాత్మకంగా శాస్త్రీయ ప్రక్రియలు
- లైవ్‌డెమానిస్ట్రేషన్ ద్వారా ప్రదర్శన
- మరో రెండురోజులపాటు సదస్సు

కాకినాడ జీజీహెచ్‌లో మృతదేహంపై ప్రయోగాత్మకంగా శాస్త్రీయ ప్రక్రియలను లైవ్ డెమానిస్ట్రేషన్ ద్వారా ప్రదర్శన ఇస్తున్న ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు.. తిలకిస్తున్న వైద్యవిద్యార్థులు

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్, రీకనస్ట్రక్టివ్ అండ్ ఈస్తటిక్ సర్జన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ(ఏపీఆర్ఏఎస్‌సీఓన్) 21వ ప్లాస్టిక్ సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు కాకినాడ రంగరాయ వైద్యకళాశాల, కాకినాడ జీజీహెచ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు వర్క్‌షాపులతో కూడిన సదస్సు గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఏపీఆర్ఏఎస్‌సీఓన్ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రత్నభూషణ్ ఆధ్వర్యంలో జీజీహెచ్ ప్రాంగణంలోని ఫోరెన్సిక్ మెడిసన్ సెమినార్ హాల్లో హైదారాబాద్, పూణేకు చెందిన ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ వై.వెంకటరమణ, డాక్టర్ ఆశీష్ దావల్ భక్తలు ముఖ్య అతిథులుగా హాజరై లైవ్ డెమోనిస్ట్రేషన్ ద్వారా రెండు వర్క్‌షాపులను నిర్వహించారు.

ఉదయం.. మధ్యాహ్నం..

ఉదయం సెషన్‌లో ఫేషియల్ ఈస్తటిక్స్‌పై కడావర్ డిసెక్షన్ నిర్వహించారు. ఈ ప్రక్రియలో ముఖ్యంగా సౌందర్యంపై శాస్త్రీయ ప్రక్రియలను మృతదేహంపై ప్రయోగాత్మకంగా నిర్వహించారు. మధ్యాహ్నం సెషన్‌లో కోలకత్తాకు చెందిన ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర విక్రమ్ సింగ్ రాథోర్ ముఖ్యఅతిథిగా హాజరై జనరల్ సర్జరీ సెమినార్ హాల్లో బొటోక్స్, ఫిల్లర్స్, థ్రెడ్స్‌పై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాపులకు 100మందికి పైబడి ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణులు వివిధ రాష్ట్రాల నుంచి హాజరయ్యారు. శుక్ర, శనివారాల్లో జరగబోయే సదుస్సు కాకినాడ వివేకానంద పార్క్ ప్రాంగణంలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రత్నభూషణ్ తెలిపారు.

అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు 'తూర్పు' పురుషులు, మహిళల జట్టు ఎంపిక

సామర్లకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపాన సంత నూతలపాడులో ఈ నెల 7 నుంచి 12 వరకూ జరగనున్న 71వ అంతర్‌జిల్లాల పురుషులు, మహిళల కబడ్డీ క్రీడా పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ గురువారం పూర్తి చేశామని, పోటీల్లో పాల్గొనేందుకు జట్టు సభ్యులు గురువారం సాయంత్రం రైలులో బయలుదేరి వెళ్లారని ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్, కోశాధికారి నిమ్మకాయల కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం రాత్రి వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా తరఫున పాల్గొనే పురుషుల, మహిళల జట్టు క్రీడాకారులకు క్రీడా దుస్తులను సామర్లకోట టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగపు ఉపాధ్యక్షులు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్(చిన్నీ) సౌజన్యంతో అందజేశామన్నారు. ఈ రెండు జట్ల క్రీడాకారులకు కోచ్‌గా పోతుల సాయిప్రసాద్ వ్యవహరిస్తారని కార్యదర్శి శ్రీనువాస్, కోశాధికారి కిరణ్ కుమార్ తెలిపారు.

పురుషుల జట్టు: కె.శ్రీనివాస్, వి.పవన్‌కుమార్, నాగు, శ్రీహరి, మనోహర్, దుర్గారావు, డేవిడ్, వెంకటనాథ్, ప్రశాంత్, నవీన్, మణి, ప్రవీణ్‌లు ఉన్నారు.

మహిళల జట్టు: అపరంజిత, పరిమళ, నాగమణి, అరుణ, ఆషీకం, వర్షిత, లీలా, భవాని, దీపిక, మంజుల, వెంకటలక్ష్మి, జీవనజ్యోతి.



ఎంపికైన ఉమ్మడి జిల్లా కబడ్డీ క్రీడాకారులతో కోచ్ తదితరులు

బాలిక అదృశ్యం మిస్టరీ

- కిడ్నాప్‌నకు గురైందంటూ తల్లిదండ్రుల ఆరోపణ
- బాలికను స్కూల్ నుంచి తీసుకెళ్లిపోయిన ఓ మహిళ

అమలాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న 14ఏళ్ల బాలిక అదృశ్యం మిస్టరీగా మారింది. ఆ బాలిక కిడ్నాప్‌కు గురైందా లేక అదృశ్యమైందా అనేది చర్చనీయాంశమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మలికిపురం మండలం తూర్పుపాలెంగ్రామానికి చెందిన బాలిక స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఆ గ్రామంలోని చికెన్ షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి భార్య మూడురోజులక్రితం హైస్కూల్‌కు వెళ్లి బాలికకు మాయమాటలు చెప్పి స్కూల్‌నుంచి తీసుకెళ్లి తర్వాత బయట నుంచి ఓ మోటారుసైకిల్‌పై ఉన్న యువకుడితో వారు వెళ్లినట్లు సమాచారం. అక్కడ సీసీ కెమెరాలను అదేరోజు సాయంత్రం పరిశీలించిన బాలిక తల్లిదండ్రులు ఈ వ్యవహారంపై మలికిపురం పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు మాత్రం బాలిక అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి ఆలస్యంగా దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగి మూడురోజులు కావడంతో బాలిక ఆచూకీపై తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. బాలికను ఉద్దేశపూర్వకంగానే కిడ్నాప్ చేశారా లేక బాలిక అదృశ్యమైందా అనే దానిపై పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది. అయితే బాలిక అదృశ్యంపట్ల పోలీసులు నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు యోగా దోహదం

- నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్
- విశ్వవిద్యాలయ యోగా జట్టు ఎంపిక

దివాన్‌చెరువు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు యోగా దోహదపడుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ వర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో యోగా అంతర్ కళాశాలల పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలు గురువారం నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ అనుబంధ కళాశాలల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు యోగా దోహదపడుతుందని, యోగాసనాల్లో విద్యార్థులంతా పట్టు సాధించి ఆరోగ్యవంతమైన సమాజానికి కృషిచేయాలన్నారు. ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల మాట్లాడుతూ యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఎనిమిది మంది వంతున విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశామని తెలిపారు.

పురుషుల జట్టు: టి.సూర్య, జి.స్వామి(ఎస్‌కేవీటీ ప్రభుత్వడిగ్రీకళాశాల,రాజమహేంద్రవరం), టి.పవన్‌కుమార్, కె.పవన్‌కుమార్, డి.మణికంఠ, జె.మణిసత్య(ఆకుల శ్రీరామ డిగ్రీ కళాశాల, తణుకు) పి.సత్తిబాబు, ఎం.హరింద కిషోర్(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమండ్రి) ఎంపికయ్యారు.

మహిళల జట్టు: బి.భవానిప్రసన్న, బి.నాగలక్ష్మీదుర్గ, కె.జ్యోతి, ఎ.సౌమ్య నాగవల్లి(ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, తణుకు) సీహెచ్ మాధవి(డీఎన్ఆర్ కళాశాల, భీమవరం) టి.లావణ్య, పి.నాగలక్ష్మి(ఆకుల శ్రీరామ డిగ్రీ కళాశాల, తణుకు), కె.హర్షనదేవి(ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం) ఎంపికయ్యారు. వీరు ఈనెల 24 నుంచి 27 వరకూ భువనేశ్వర్‌లోని కిట్ విశ్వవిద్యాలయంలో అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయం పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శులు కె.బాలసత్యనారాయణ, ఎ.సత్యనారాయణ, పరిశీలకుడు ఎల్.రమేష్, ఎంపిక కమిటీ సభ్యులు శివశంకర్, ఇ.గౌరిఅనూష, వ్యాయామ విద్యఅ ధ్యాపకులు బి.రామ్‌గోపాల్, డేవిడ్, సుబ్రహ్మణ్యం బాషా పాల్గొన్నారు.



అఖిలభారత యోగా పోటీలకు ఎంపికైన నన్నయ పురుషుల, మహిళల జట్టు

కణుపూరు వీఆర్వో ఆత్మహత్యాయత్నం

పురుగుల మందు తాగిన రెవెన్యూ అధికారి

గోకవరం/కోరుకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కణుపూరు గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న తామడ సత్యనారాయణ ఆత్మహత్యకు యత్నించారు. విధి నిర్వహణలో భాగంగా తీవ్రఒత్తిడి, అప్పులబాధ, కుటుంబ తగాదాల నేపథ్యంలో ఈనెల 4న పురుగుల మందు తాగారని, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానేఉందని సమాచారం. కాగా సత్యనారాయణ స్వగ్రామం గోకవరం మండలం వెదురుపాక గ్రామం. కాగా గోకవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణను గురువారం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను కుటుంబసభ్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో సంఘం నాయకులు మంగి అప్పలనాయుడు, అనంతరపు శ్రీనివాసరావు, పి.శంకర్రావు తదితరులున్నారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర రాజు మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ అధికారుల వైఖరిలో మార్పు రాలేదని, మార్పు రాకపోతే జిల్లావ్యాప్తంగా వీఆర్వోలు విధులు బహిష్కరిస్తారని పేర్కొన్నారు.

పుట్టలో కొలువైన నాగదేవత

● షష్టి ఉత్సవాలకు ఏర్పాట్లు



అమలాపురం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నడిపూడి శివారు మెట్ల రాంజీ కాలనీలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం (పుట్ట ఆలయం) వద్ద షష్టి తీర్థానికి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. శుక్రవారం రాత్రి 10.21 గంటలకు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం జరుగుతుంది. శనివారం స్వామివారి ఆలయ ప్రాంగణంలో తీర్థం నిర్వహిస్తారు. ఇక్కడ పుట్టలో కొలువైన నాగదే వతను అర్చించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అదేవిధంగా బండారులంక శ్రీభువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో రాత్రి 7 గంటలకు కల్యాణం నిర్వహించనున్నారు. రంగాపురంలోని అతి పురాతనమైన శ్రీవల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం కల్యాణోత్సవాలకు ముస్తాబైంది.

● అమలాపురం శ్రీకృష్ణేశ్వర, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి 1.45 గంటలకు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దివ్య కల్యాణం జరుగుతుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.శ్రీనివాస్, చంద్రమౌళి వెంకటసత్యసూర్యనారాయణ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయం ఎదురుగా ఉన్న శ్రీయేడిది సత్యనారాయణ కల్యాణ మండపంలో స్వామి కల్యాణం జరుగుతుంది. దేవదాయశాఖ ఆధ్వర్యంలో శనివారం షష్టి తీర్థానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు.

బీటలు వారుతున్న బీసీ హాస్టల్



బీసీ హాస్టల్‌లో బీటలు తీసిన పిల్లరును పరిశీలిస్తున్న హాస్టల్ సిబ్బంది

అంతర్వేది, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో బీసీ హాస్టల్ శ్లాబ్, స్తంభాలు బీటలు వారుతున్నాయి. వర్షపు నీరు నిల్వ ఉండి దుర్వాసన వచ్చే పరిస్థితులను, పిల్లలు అనారోగ్యానికి గురి కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను గ్రామస్తుడు పొన్నాల విజయ్ మిత్ర బృందంతో కలిసి కోరారు. బీసీ హాస్టల్ శ్లాబ్, స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని హాస్టల్ సిబ్బంది తెలిపినట్టు విజయ్ తెలిపారు. కార్యక్రమంలో బొమ్మిడి రమేష్ (ధోని), కొపనాతి నరసింహస్వామి, పొన్నాల నరసింహస్వామి పాల్గొన్నారు.

సామాజిక భవనానికి శంకుస్థాపన

మలికిపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చింతలమోరి పోడితోటలో సర్పంచ్ డాక్టర్ రాపాక రమేష్‌బాబు తన కుమారస్వామి జ్ఞాపకార్థం గురువారం సామాజిక భవననిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తన సొంత నిధులతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్టు ఆయన చెప్పారు.బి.నారాయణరావు, సురేష్, ఈశ్వరరావు,వెంకటరత్నం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం



పి.గన్నవరంలో ఓటువేస్తున్న ఉపాధ్యాయురాలు



ఉప్పలగుప్తంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి



అల్లవరం నుంచి పోలింగ్ బాక్సులను తీసుకువెళుతున్న అధికారులు

ముమ్మిడివరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ముమ్మిడివరంలో గురువారం ప్రశాంతంగా జరిగింది. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్‌లో 137 ఓట్లకుగాను 130 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 94. 89శాతం నమోదైంది. పురుష ఓటర్లు 90కు 87 మంది, మహిళా ఓటర్లు 47 మందికి 43 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్టు ఏఈఆర్వో ఎం.సుబ్బలక్ష్మి తెలిపారు.

అంబాజీపేటలో 121 ఓట్లు

అంబాజీపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక అంబాజీపేటలో నిర్వహించిన పోలింగ్ కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. మండలంలో 129 ఓట్లకు గాను 121 ఓట్లు నమోదైనట్లు తహశీల్దారు జె.వెంకటేశ్వరి తెలిపారు. వీరిలో పురుషులు, 75, మహిళలు 46 మంది ఉన్నారు.

మామిడికుదురులో 171 ఓట్లు

మామిడికుదురు: మామిడికుదురు తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 171 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 179 మంది ఉపాధ్యాయ ఓటర్లకుగాను 171 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రంలో ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా తహశీల్దార్ ఆచార్యులు, పోలీసులు ఏర్పాట్లు చేశారు.

పి.గన్నవరంలో 113 ఓట్లు

పి.గన్నవరం: మండల వ్యాప్తంగా పురుషులు 87, స్త్రీలు 32మంది ఓటర్లు వెరసి 119మంది ఉండగా 113మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రంను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరిశీలించి ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ పి.శ్రీపల్లవి పోలింగ్‌ను పరివేక్షణ చెయ్యగా ఎస్ఐ బి.శివకృష్ణ తన సిబ్బందితో బందోస్తు నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి ఒక ఉపాధ్యాయుడు రాగా ఆయన వద్ద గుర్తింపుకార్డు లేకపోవడంతో పోలింగ్ అధికారులు ఆయన ఓటును తిరష్కరించారు. దీంతో ఆయన ఓటు వేయకుండానే వెనుదిరిగారు.

కాట్రేనికోనలో 51 ఓట్లు

కాట్రేనికోన: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా జరిగింది. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 58 ఓట్లకు గాను 51 ఓట్లు పోలైనట్టు తహసీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు.

అల్లవరంలో 73 ఓట్లు

అల్లవరం: ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. 74ఉపాధ్యాయ ఓట్లకుగాను 73 పోల్ అయ్యాయి. 26మంది మహిళలు, 47మంది పురుష ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ అధికారి మురళీ పర్యవేక్షణలో ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నడుమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీఎన్నికలు జరిగాయి.

ఉప్పలగుప్తంలో 54 ఓట్లు

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 55 ఓట్లకు గాను 54 ఓట్లు పోలైనట్టు ఎన్నికల అధికారి, తహసీల్దార్ వాసా దివాకర్ తెలిపారు. అమలాపురం ఆర్డీవో కె.మాధవి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.

మలికిపురంలో 150 ఓట్లు

మలికిపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గురువారం మలికిపురం ఏఎఫ్‌డీటీ కళాశాలలో నిర్వహించిన పోలింగ్‌లో 161 ఓట్లకు 150 ఓట్లు పోలయ్యాయి. 114 మంది పురుషులు, 36 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 93.16 శాతం పోలింగ్ నమోదైనట్టు తహశీల్దార్ టి.శ్రీనివాసరావు తెలిపారు.

రాజోలులో 234 ఓట్లు పోలింగ్

రాజోలు: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నిక గురువారం రాజోలులో ప్రశాంతంగా జరిగిందని తహశీల్దార్ ప్రసాద్ తెలిపారు. రాజోలు మండల రిసోర్స్ సెంటర్ పోలింగ్ కేంద్రంవద్ద ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. 242 ఓట్లకుగాను 234 ఓట్లు పోలయ్యాయని చెప్పారు. పురుషులు 155, మహిళలు 79 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సఖినేటిపల్లిలో 116 ఓట్లు

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్యే ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. 123 ఓట్లకుగాను 116ఓట్లు పోలయ్యాయి.

సేంద్రియ సాగువైపు రైతులు ఆసక్తి చూపాలి

ఆత్మా పీడీ జ్యోతిర్మయి

ప్రపంచ నేలల పరిరక్షణ దినోత్సవం



పుల్లేటికుర్రు సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మా పీడీ జ్యోతిర్మయి



వీవీమెరకలో మాట్లాడుతున్న ఏవో నరసింహారావు

అంబాజీపేట,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మట్టి అనేది జీవితంలో ఓముఖ్యమైన భాగమని, ఆరోగ్యకరమైన నేల లేకుండా మనం ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించలేమని ఆత్మా పీడీ జ్యోతిర్మయి అన్నారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రులో ప్రపంచ నేల దినోత్సవాన్ని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జ్వీ రామ్మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ జ్యోతిర్మయి మాట్లాడుతూ మొక్కలు వృద్ధి చెందడానికి మందపాటి, మొత్తడి, పోషకాలు అధికంగా ఉండే నేల అవసరమన్నారు. భూమిలో ఒకేసారి ఒకే పంటలను వేయకుండా పంటలను మార్చడం ద్వారా దిగుబడులతో ఆదాయం పెరుగుతుందన్నారు. రైతులు సేంద్రియ పద్ధతులలో సాగుచేయడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించడంతోపాటు నేలస్వభావం తగ్గకుండా ఉంటుందన్నారు. భూమిలో రసాయనిక ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రియ సాగువైపు రైతులు ఆశక్తి కనబర్చాలన్నారు. కార్యక్రమంలో డాట్ శాస్త్రవేత్త నందకిషోర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రాజశేఖర్, ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్టు అడిషనల్ డీపీఎం ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.శ్రీనివాసరావు, నాగవరపు శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రపంచ నేల దినోత్సవాన్ని మొగలికుదురు రైతు సేవాకేంద్రంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం, కృషి విజ్ఞాన యోజన జిల్లా కేంద్రం నుంచి వచ్చిన వ్యవసాయాధికారి జె.మనోహర్ నేల స్వభావాల గురించి, స్వస్థధారతో కేత్ హరాపై కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఉద్యానవన శాఖాధికారి దిలీప్ పాల్గొని ఉద్యాన పంటలు, పథకాల కోసం అంతర్‌పంటల విస్తరణ, ప్రోత్సాహం, హైబ్రీడ్ కూరగాయల సాగుకు కొబ్బరి ప్యాక్‌హౌస్, కలెక్షన్ సెంటర్ కోసం రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఏవోలు బి.మృదుల, వై.మధు, ఏఈవోలు వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రపంచ నేలల పరిరక్షణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. వీవీ మెరక గ్రామంలో వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు రైతులకు భూసార పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ముమ్మిడివరం మండలంలో ఉన్న అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. అయినాపురం, అనాతవరం, ముమ్మిడివరం, ఎంహెచ్‌క్యూ-1, ముమ్మిడివరం ఎంహెచ్‌క్యూ-2, ఆర్‌డబ్ల్యుఎస్, కొత్తలంక, రాణిలంక ఫీడర్లపై విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కాట్రేనికోన: శుక్రవారం చెయ్యేరు, కాట్రేనికోన విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో జంగిల్ కటింగ్, నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్ కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఈ కారణంగా కాట్రేనికోన, చెయ్యేరు సబ్‌స్టేషన్ల పరిధిలో అన్ని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

గోగన్నమఠం డ్రెయిన్‌లో ఆక్రమణలు గుర్తింపు

మలికిపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోగన్నమఠం డ్రెయిన్‌లో గొల్లపాలెం, తూర్పుపాలెం గ్రామాల పరిధిలో ఏడు అక్రమ రొయ్యల చెరువలను రెవెన్యూ అధికారులు గుర్తించినట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. వాటికి వెంటనే విద్యుత్ కనెక్షన్లు తొలగించి చెరువులను తొలగించాలని తద్వారా డ్రెయిన్ ప్రవాహాన్ని పునరుద్ధరించాలని విద్యుత్, డ్రైనేజీ అధికారులకు తెలిపినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

బీవీసీలో ఫ్యాకల్టీ డెవలెప్‌మెంట్ శిక్షణ

అల్లవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బోనం వెంకటచలమయ్య ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్, కళాశాల ఇన్నోవేషన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో బోధనా సిబ్బందికి రూపకల్పన ఆలోచనలను, ఆవిష్కరణల అంశంపై రెండురోజుల ఫ్యాకల్టీ డెవలెప్‌మెంట్ శిక్షణ గురువారం ప్రారంభమైంది. విజయవాడ సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ గుమ్మడి శ్రీనివాసరావు, డాక్టర్ నాగమల్లేశ్వరరావులు రిసోర్స్ పర్సన్లుగా హాజరై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.మహేశ్వర్, డాక్టర్ ఏ.రామకృష్ణ, వై.రమణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఏ.ప్రవీణ్, ఎం.శివకుమార్, శ్రీకాంత్, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

అమలాపురంటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఎర్రవంతెన వద్ద దుర్గా మెమోరియల్ బ్లడ్ బ్యాంకులో గురువారం దళితసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి దళితసేన అధ్యక్షుడు డేవిడ్ అంబేడ్కర్ పూలమాలలువేసి నివాళులర్పించారు. విజయ మెడికల్ కేర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ రత్నబెనర్జీ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 25 మంది దళితసేన సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కాశి శ్రీహరి, పినిపే రవికుమార్, వాకపల్లి హరీష్, తానంకి వసంతకుమార్, చిత్రపు జయరాజ్, పరమట కృపావరం, సంతోష్, గోపీచంద్, రాజేష్ పాల్గొన్నారు.

'పోషణ వాటిక'ను విజయవంతం చేయాలి

మామిడికుదురు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్లలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ వాటిక కార్యక్రమాన్ని విజయవంతమయ్యేలా చూడాలని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలో 23 కేంద్రాలవద్ద కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. సూపర్‌వైజర్లు జయలత, అన్నపూర్ణ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

బస్‌గ్యారేజీని సందర్శించిన ముక్తేశ్వరం విద్యార్థులు



అమలాపురం బస్సు గ్యారేజీని సందర్శించిన ముక్తేశ్వరం పాఠశాల విద్యార్థులు

అయినవిల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం ఉన్నత పాఠశాల విద్యార్థులు అమలాపురంలో ఆర్టీసీ బస్టాండులోని బస్ గ్యారేజీని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అమలాపురం డిపో మేనేజర్ సీహెచ్‌ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ వృత్తి విద్యను అభ్యసించడం ద్వారా స్వావలంబన, స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునన్నారు. ఈ లోకోమోటివ్ కోర్సులు అభ్యసించడానికి ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు ఆధ్వర్యంలో 9, 10 తరగతుల విద్యార్థుల సందర్శన జరిగింది. ఇండస్ట్రియల్ టూర్ జిల్లా బాలికా శిశుసంక్షేమాభివృద్ధి అధికారి ఎంవీకే భీమారావు, ఒకేషనల్ కోఆర్డినేటర్ కె.రమేష్, ఆటోమోటివ్ ట్రైనర్ వై.వెంకటేష్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు జి.సాయిశ్రీనివాస్, ఎస్.మేరీగ్రేస్, వ్యాయామఉపాధ్యాయులు ఎస్.రమేష్, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

బియ్యం అవకతవకలపై డీఎస్పీ విచారణ



అంబాజీపేటలో స్టాక్ పాయింట్‌లో విచారణ చేపడుతున్న డీఎస్పీ

అంబాజీపేట, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్‌లో జరిగిన రేషన్ బియ్యం అవకతవకలపై సివిల్‌సప్లై అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు విచారణ చేపట్టారు. అంబాజీపేట మార్కెట్‌యార్డులో ఉన్న స్టాక్ పాయింట్‌లో ఆయన రిజిష్టర్లు, కంప్యూటర్ రికార్డులు, స్టాకును పరిశీలించారు. అనంతరం అక్కడ స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్‌గా ఉన్న డిప్యూటీ తహశీల్దారు సత్యనారాయణతోపాటు అక్కడ ఉన్న సిబ్బంది, హమాలీలను విచారించారు. స్టాక్ ఎక్కడి నుంచి వస్తుంది.. ఇక్కడ నుంచి ఎన్ని మండలాలకు సరుకు వెళ్తుందని అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అంబాజీపేట మార్కెట్ యార్డులో సివిల్‌సప్లై ఆధ్వర్యంలో ఉన్నస్టాక్ పాయింట్‌లో 379.75 టన్నుల బియ్యం విలువ రూ.1.79కోట్లు ఉందని ఆ బియ్యాన్ని అప్పటి స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్‌గా ఉన్న గుత్తుల శ్రీనివాసరావు మాయం చేసినట్లు సివిల్‌సప్లై అసిస్టెంట్ మేనేజర్ నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు సమగ్రంగా విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఏ సంవత్సరం నుంచి బియ్యం పక్కదారి పట్టిందో అప్పుడు ఉన్న అధికారులు, ట్రాక్టర్ యజమానులు, సిబ్బంది, హమాలీలతో విచారణ నిర్వహిస్తామన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు. డీఎస్పీ వెంట పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్ఐ కె.చిరంజీవి ఉన్నారు.

రాజోలు సొసైటీ బ్యాంకు ఎదుట ఉద్యోగుల నిరసన



రాజోలులో బ్రాంచి ముందు నిరసన తెలిపిన ఉద్యోగులు

రాజోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం గూడపల్లి సొసైటీ సీఈవో ఎన్.వీరవెంకట సత్యనారాయణ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినందుకు రాజోలు సొసైటీ బ్యాంకు ఎదుట ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. స్టీవెన్ పాల్ వేధింపులకు గురి చేస్తున్నారని, కంప్యూటరైజేషన్ పేరుతో పని ఒత్తిడి పెంచి మానసికంగా వేధిస్తున్నారని రాష్ట్ర నాయకులు సీహెచ్ వెంకటేశ్వరరావు, పి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం జిల్లా అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, కోనసీమ జిల్లా అధ్యక్షుడు వై.రామచంద్రరావు, సీఈవోలు రామలింగేశ్వరరావు, జయరామ్, లీలాకృష్ణ, అయ్యప్పనాయుడు పాల్గొన్నారు.

క్రిస్టియన్ కమ్యూనిటీ భవనాల నిర్మాణం



ఐక్యక్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మం డలాల్లో క్రిస్టియన్ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి కృషిచేస్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మాచవరంలోని పోతాయిలంక త్రియేకప్రార్థన మందిరంలో జిల్లా జనరల్ సెక్రటరీ చికిలే ధనరాజు అధ్యక్షతన అంబాజీపేట మండల యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం ఐక్య క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రైస్తవుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి వెంకటసుబ్బారావు, షైపాల తాతాజీ, 2వాక్యోపదేశకులు డాక్టర్ డానియేలు, కరుణాకర్, కె.విజయకుమార్, లాజరస్, విలయమ్స్, కుసుమ రత్నం, యేసురత్నం, కృపాపాల్, మనోహర్ పాల్గొన్నారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం



పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేస్తున్న మృతదేహం

ముమ్మిడివరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం మర్లపాలెం పంచాయతీ పరిధిలోని కాశివారిపేటకు చెందిన ఖననం చేసిన వ్యక్తి మృతదేహానికి గురువారం ముమ్మిడివరం పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. మర్లపాలెం పంచాయతీ కాశివారిపేటకు చెందిన కాశి సత్యనారాయణ (45) గత ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పేర్కొంటూ కుటుంబ సభ్యులు అతని మృతదేహాన్ని సోమవారం మృతి చెందారు. కాశి సత్యనారాయణ సోదరుడు బాలయోగి తన సోదరుడు సత్యనారాయణది ఆత్మహత్యకాదని హత్య అని, అతని మృతిపై పలు అనుమానాలు వ్యక్తంచేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్‌లు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులు, బంధువులు, భార్య విజయకుమారిలను పోలీసులు విచారించారు. మండల మేజిస్ట్రేట్, తహశీల్దార్ ఎం.సుబ్బలక్ష్మి సమక్షంలో శవపంచనామా నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు గోపీచంద్, వెంకటరమణలు, నగర పంచాయతీ వైద్య సిబ్బంది, పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. సత్యనారాయణకు భార్య విజయకుమారి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

మాలల మహాగర్జన విజయవంతం చేయండి



ఛలో గుంటూరు కరపత్రం ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

ఉప్పలగుప్తం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న గుంటూరులో జరిగే మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు పిలుపునిచ్చింది. గురువారం ఉప్పలగుప్తం బాలయోగి పార్కులో మాల మహానాడు సమావేశం కొంకి వెంకటబాబ్జి అధ్యక్షతన జరిగింది. మాలల మహాగర్జన కార్యక్రమానికి సంబంధించి చలో గుంటూరు కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో కుంచే బాబులు, బడుగు శ్రీనివాస్, తాళ్ల రవిలలిత, పోలినాటి వెంకటేశ్వరరావు, గెద్దాడ బుద్ధరాజు, దోనిపాటి అశోకచక్రవర్తి, బొంతు రమణ, మెండి డేవిడ్‌అంబేడ్కర్, పోతుమూడి రవికుమార్, దేవరపల్లి రాంబాబు, విప్పర్తి సత్యనారాయణ, నడింపల్లి సుబ్బరాజు, అయితాబత్తుల సువర్ణరాజు, నాగాబత్తుల కొండబాబు పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు కూటమి ప్రభుత్వంలో సముచిత స్థానం

అంబాజీపేట, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): బీసీ సామాజిక వర్గంలో ఉన్న శెట్టిబలిజలకు కూటమి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని, వారి సంక్షేమాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధర్(పెదబాబు) అన్నారు. అంబాజీపేటలో పెదబాబును ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన దండను ఆయనకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ అరిగెల బలరామమూర్తి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు రవణం రాము, దొమ్మేటి రామారావు పాల్గొన్నారు.

మరో అల్పపీడనంతో తీరంలో అలజడి



ఓడలరేవులో ఎగిసిపడుతున్న సముద్ర కెరటాలు

అల్లవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడగా అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం సముద్రతీరంలో అలలు ఉవ్వెత్తిన ఎగిసిపడుతున్నాయి. ప్రతికూల వాతావరణంతో తీరంలో అలజడి కొనసాగుతోంది. అలల ఉధృతి పెరిగితే తీరభూమి మరింత కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. వాతావరణంలో నెలకొన్నమార్పుల దృష్ట్యా సార్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

గెద్దనపల్లిలో కేంద్ర మంత్రి



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మతో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

కాట్రేనికోన, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ గురువారం గెద్దనపల్లిలో తమ బంధువుల ఇంటికి వచ్చారు. ఆయన అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, దాట్ల పృథ్వీ బీజేపీ నాయకుడు గ్రంధి నానాజీ ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

హౌస్‌హోల్డ్ సర్వేలో రాష్ట్రంలో అల్లవరం ప్రథమ స్థానం



ఎంపీడీవో కృష్ణమోహన్

అల్లవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హౌస్‌హోల్డ్ ఇమేజ్ క్యాప్చర్ సర్వేలో అల్లవరం మండలం రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిందని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కేవలం ఉమ్మడి జిల్లాలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో 22860 ఇళ్ల నూరుశాతం సర్వే సాధించి రాష్ట్రంలో మొదటి మండలంగా నిలిచిందన్నారు. దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్‌కు వివరాలు తెలిపి సహకరించిన ప్రజలను ఆయన అభినందించారు. కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించిన డిజిటల్ అసిస్టెంట్లను, సచివాలయ ఉద్యోగులను ఆయన అభినందించారు.

'ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్షను పగడ్బందీగా నిర్వహించాలి'

● డీఈవో షేక్ సలీం బాషా



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో షేక్ సలీంబాషా

ముమ్మిడివరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కారల్‌షిప్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సూచించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించి నియమించిన సీఎస్, డీవైఈవోలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో సలీంబాషా మాట్లాడుతూ పది పరీక్షల మాదిరిగానే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పరీక్షల విభాగ ఇన్‌చార్జి, అసిస్టెంట్ డైరెక్టర్ బి.హనుమంతరావు మాట్లాడుతూ అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం, రెవెన్యూ డివిజన్ కేంద్రాల పరిధిలో 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం ప్రస్తుతం అమలవుతున్న విద్యా పరమైన అంశాలపై డీఈవో సలీం బాషా సమీక్ష నిర్వహించారు. సమగ్ర శిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు పాల్గొన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి ఒకరోజు ఆదాయం రూ.3,35,939 వచ్చినట్టు ఉప కమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. సాయంత్రం జరిగిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



ఆత్రేయపురం మండలం వాడపల్లిలో ధాన్యాన్ని ఆరబెడుతున్న దృశ్యం

ముమ్మరంగా వరి మాసూళ్లు

ఆత్రేయపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో నిలిచిపోయిన వరిమాసూళ్లు మళ్లీ ఊపందుకున్నాయి. రెండు రోజులుగా వాతావరణం రైతులకు అనుకూలంగా ఉండటంతో వరిమాసుళ్ళు ముమ్మరంగా చేపడుతున్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబోసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇటీవల తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు ధాన్యపు రాశులు కల్లాల్లోనే ఉండిపోయాయి. రెండు రోజుల నుంచి ఎండ రావడంతో రహదారులపై ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. అధికార యంత్రాంగం రైతులకు పలు సూచనలు చేస్తూ మిల్లులకు తరలించే పనుల్లో ఉన్నారు. వరిమాసూళ్లలో రైతులు సందడిగా కనిపిస్తున్నారు.

షష్ఠి ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి



ఏడిద సంఘమేశ్వరంలోనున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు

మండపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏడిద సంఘమేశ్వరస్వామి ఆలయంలో రేపు జరిగే షష్ఠి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. దక్షిణ కాశీగా ఈ ఆలయం పేరుగాంచింది. ఇక్కడున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేస్తే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. షష్ఠి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు సూర్యనారాయణ తెలిపారు. మండపేట పరిసర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంతో పాటు మండపేట మండలంలో కూడా ఆయా ఆలయాల్లో షష్ఠి వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

ఆలమూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆలమూరులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 55 ఓట్లు వేయాల్సి ఉండగా 51 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఆత్రేయపురం: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రశాంతంగా జరిగింది. పోలింగ్‌లో 43 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. తహశీల్దారు రాజేశ్వరరావు, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ రాము పోలింగ్ సరళిని పరిశీలించారు.

మండపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పోలింగ్ కేంద్రంలో 172 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్టు మండపేట మండల తహశీల్దార్ తేజేశ్వరరావు తెలిపారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన రామచంద్రపురం ఆర్డీవో అఖిల: మండపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని రామచంద్రపురం ఆర్డీవో అఖిల గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సరళిపై ఆమె తెలుసుకున్నారు. ఆమె వెంట మండల తహశీల్దార్ తేజేశ్వరరావు, ఎన్నికల డీటీ మెహర్‌బాబా, పట్టణ ఎస్ఐ, ఏఎస్ఐలు హరికోటి శాస్త్రి, చిన్నారావు తదితరులు వున్నారు.



కొత్తపేటలో పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో శ్రీకర్

కె.గంగవరం: మండలంలో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు మండలం లో ప్రశాంతంగా జరిగాయి. కె.గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 69 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రామచంద్రపురం (ద్రాక్షారామ): రామచంద్రపురంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా జరిగింది. పాత తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 393 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో దేవరకొండ అఖిల పరిశీలించి పోలింగ్ సరళి తెలుసుకున్నారు.

కపిలేశ్వరపురం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల పోలింగ్ అధికారి ఎంపీడీ తేజ్, ఏపీవో జీవీఎస్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో జరిపారు. ఈ కేంద్రంలో 54 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తహశీల్దార్ పి.చిన్నారావు తెలిపారు. కార్యక్రమంలో సెక్టర్ ఆఫీసర్ జానకిరామయ్య, రెవెన్యూ ఉద్యోగులు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాన్ని మండపేట రూరల్ సీఐ దొరరాజు ఆధ్వర్యంలో అంగర ఎస్ఐ రవి కుమార్ పరిశీలించారు.

కొత్తపేట: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా సాగింది. మండల కేంద్రానికి సంబంధించి 197 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తహశీల్దారు వై.రాంబాబు తెలిపారు. తొలుత పోలింగ్ కేంద్రాన్ని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సందర్శించి పోలింగ్‌పై పలు సూచనలు చేశారు.

రాయవరం: ఉభయ గోదావరి జిల్లా ఉపాధ్యాయుల నియోజకవర్గం ఉప ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 55 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తహశీల్దారు ఐపీ శెట్టి తెలిపారు.

రావులపాలెం: రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్టు తహశీల్దారు ముక్తేశ్వరరావు తెలిపారు. మండలంలో 163 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.





రాయవరంలో ఎమ్మెల్సీ ఓటు వేస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో కె.గంగవరంలో ఓటు వేస్తున్న టీచర్



ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఇసుకర్యాంపు ప్రారంభం

కపిలేశ్వరపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) కపిలేశ్వరపురంలో గురువారం ఉచిత ఇసుక రీచ్‌ను ప్రారంభించారు. మిథిలా కనస్ట్రక్షన్‌కు చెందిన ప్రతినిధులు ఈ రీచ్‌ను ప్రారంభించారు. తహశీల్దార్ పి.చిన్నారావు మాట్లాడుతూ జియో కోఆర్డినేట్స్ పరిధిలో మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు రామకృష్ణ, వెంకటేశ్వరరావు, పలువురు జట్టు కూలీలు పాల్గొన్నారు.

వృద్ధులు, పేదలకు చీరల పంపిణీ

రాయవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠం వద్ద గురువారం విజయదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం వృద్ధులు, పేదలకు చీరలు పంపిణీ చేశారు. సమితి ప్రతినిధి గాదే సత్య వెంకట కామేశ్వరి మాట్లాడుతూ వృద్ధులు, పేదలకు చీరలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు బలిజేపల్లి రమ, గాదే సత్య వెంకట కామేశ్వరి, భాస్కరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన పైప్‌లైన్లతో ప్రజలకు పాట్లు

• మంచినీరు అందక ప్రజల ఆగ్రహం • ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

మండపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కాలం చెల్లిన మంచినీటి పైపులైన్ల కారణంగా తరచూ పగిలి పోతుండటంతో మంచినీరు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. పట్టణంలో సింహభాగం పైప్‌లైన్లు పూర్వ కాలం నిర్మించినవే కావడంతో తరచూ అవి పగిలిపోతున్నాయి. దీంతో అప్పటికప్పుడు వాటర్‌వర్క్స్ సిబ్బంది తాత్కాలిక మరమ్మతులు చేస్తూ నెట్టుకొస్తున్నారు. పట్టణంలో పలు వార్డుల్లో ఇప్పటికీ పాతకాలం నాటి కుండ పైపులైన్లే దర్శనమిస్తున్నాయి. దీంతో తరచూ ఎక్కడో ఒకచోట మరమ్మతులు చేయాల్సి వస్తోంది. మంచినీటి సరఫరా జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కొత్త పైప్‌లైన్లు వేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

రజకులపై దాడులు అరికట్టాలి



కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసిన రజక సంఘం పెద్దలు

ఆత్రేయపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రజకులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని రజక చైతన్య సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కె.రామారావు డిమాండ్ చేశారు. గురువారం రావులపాలెం వచ్చిన ఆయన్ను నియోజకవర్గ రజక సేవా సంస్థ సభ్యులు కలిశారు. ఆత్రేయపురం మండలం రాజవరం గ్రామంలో రజకులు ఏర్పాటు చేసిన షెడ్‌ను తొలగించిన ఘటనను ఆయనకు తెలిపారు. రాజవరం రజక సంఘ సభ్యుల ఆధ్వర్యంలో 20 ఏళ్లుగా షెడ్‌ను నిర్మించుకుని ప్రతి ఏటా గణపతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆ షెడ్‌ను సర్పంచ్ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసి రాజవరంలో జరిగిన సంఘటనను తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి సర్పంచ్‌తో ఫోన్లో మాట్లాడి జరిగిన ఘటనపై ఆరా తీశారు. రజకుల షెడ్‌ను యథావిధిగా నిర్మించాలని సర్పంచ్‌కు సూచించారు. సమస్యను పరిష్కరిస్తామని రజక సంఘ నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పెరవలి వెంకటేశ్వరరావు, గణేష్, మాగాపు విజయకుమార్, ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

ఆలమూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఆలమూరు పోలీసులు దాడి చేశారు. ఇందులో భాగంగా 33 మద్యం బాటిళ్లతో గుమ్మిలేరుకు చెందిన ఐ.సాహెల్‌ను రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి మద్యం బాటిళ్లతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ రాము తెలిపారు.

బంచ్ ఫీడింగ్, స్ప్రేయింగ్‌తో రైతుకు అధిక లాభం

కపిలేశ్వరపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు బంచ్ ఫీడింగ్, స్ప్రేయింగ్‌తో అధిక ఆదాయం పొందవచ్చని డాక్టర్ చలపతిరావు, డాక్టర్ ఎం.విశ్వనాథ్ తెలిపారు. గురువారం కేదార్లంక పరిధిలో ఉద్యాన పరిశోధన స్థానం- అంబాజీపేట ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయంలో నాల్గవ సంవత్సరం చదువుతున్న 16 మంది విద్యార్థులు శాస్త్రవేత్తల సలహాలతో అరటిలో బంచ్ ఫీడింగ్, స్ప్రేయింగ్ తయారీ విధానాన్ని రైతులకు తెలిపారు. బంచ్ ఫీడింగ్, స్ప్రేయింగ్ విధానంలో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని వారన్నారు.

గెద్దనపల్లిలో కేంద్ర మంత్రి

కాట్రేనికోన, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ గురువారం గెద్దనపల్లిలో తమ బంధువుల ఇంటికి వచ్చారు. ఆయన అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, దాట్ల పృథ్వీ, బీజేపీ నాయకుడు గ్రంధి నానాజీ ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

హౌస్‌హోల్డ్ సర్వేలో రాష్ట్రంలో అల్లవరం ప్రథమస్థానం

అల్లవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హౌస్‌హోల్డ్ ఇమేజ్ క్యాప్చర్ సర్వేలో అల్లవరం మండలం రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిందని ఎంపీడీవో టీఎస్ఎస్ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కేవలం ఉమ్మడి జిల్లాలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో 22860 ఇళ్ల నూరు శాతం సర్వే సాధించి రాష్ట్రంలో మొదటి మండలంగా నిలిచిందన్నారు. దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్‌కు వివరాలు తెలిపి సహకరించిన ప్రజలను ఆయన అభినందించారు. కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించిన డిజిటల్ అసిస్టెంట్లను, సచివాలయ ఉద్యోగులను ఆయన అభినందించారు.

'ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షను పగడ్బందీగా నిర్వహించాలి'

● డీఈవో షేక్ సలీం బాషా

ముమ్మిడివరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సూచించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించి నియమించిన సీఎస్, డీవైఈవోలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో సలీంబాషా మాట్లాడుతూ పది పరీక్షల మాదిరిగానే ఎన్ఎంఎంఎస్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పరీక్షల విభాగ ఇన్‌చార్జి, అసిస్టెంట్ డైరెక్టర్ బి.హనుమంతరావు మాట్లాడుతూ అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం, రెవెన్యూ డివిజన్ కేంద్రాల పరిధిలో 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం ప్రస్తుతం అమలవుతున్న విద్యా పరమైన అంశాలపై డీఈవో సలీం బాషా సమీక్ష నిర్వహించారు. సమగ్ర శిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు





రాయవరంలో భూసారంపై రైతులకు వివరిస్తున్న ఏవో ప్రభాకర్. పక్క చిత్రంలో ఆలమూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న ఏడీఏ నాగేశ్వరరావు

రాయవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 రైతు భరోసా కేంద్రాల్లో గురువారం ప్రపంచ నేల దినోత్సవాన్ని జరిపారు. మండలంలోని పసలపూడి రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ మాట్లాడుతూ పరిమితికి మించి ఎరువుల వినియోగంతో నేల దెబ్బతినడం వల్ల భూమిలో రైతులకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, శిలీంధ్రాలు నశించిపోతాయన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను ఏవో రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు షారోని, రైతులు పాల్గొన్నారు.

ఆలమూరు: నేలను రక్షించుకోవలసిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని వ్యవసాయ శాఖ ఆలమూరు అసిస్టెంట్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు అన్నారు. ఆలమూరులో గురువారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా రైతులతో సమావేశం జరిపారు. ఎరువుల వాడకంలో భూసార పరీక్షల ద్వారా సూచించిన ఎరువులను మోతాదు ప్రకారం ఉపయోగించాలని కోరారు. సమావేశంలో ఆలమూరు పీఏసీఎస్ సీఈవో సుబ్రహ్మణ్యం, ఆర్‌బీకే సిబ్బంది, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కైలాసభూమిని ప్రారంభిస్తాం



కైలాసభూమి పనులు పరిశీలిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కైలాస భూమిని త్వరలో ప్రారంభిస్తామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం కైలాస భూమి ప్రదేశాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పనులు పరిశీలించారు. రూ.40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డును, ఆధునీకరించిన భవనాలు, సౌకర్యాలను చూసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. దీన్ని ప్రారంభించడానికి అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త రెడ్డియ్య, కంఠంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ బి.జయలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

క్విజ్ పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

మండపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ సంస్థ అధినేత దీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీల్లో తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలు అందుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొన్న తమ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో విజేతలైన వారిని ఆయనతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.



విజేతలుగా నిలిచిన శ్రీచైతన్య విద్యార్థులు



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీఐ విద్యాసాగర్

పోలీసులు స్నేహ భావంతో మెలగాలి

ఆత్రేయపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు స్నేహ భావంతో వ్యవహరించి సత్వరమే ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు. గురువారం ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రక్రియను ఎస్ఐ రాముతో కలిసి ఆయన పరిశీలించారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

ఆలమూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చింతలూరు మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి దాతలు అందించిన ప్లేట్లను ఎంఈవో అప్పాజీ గురువారం పంపిణీ చేశారు. విజయవాడకు చెందిన సాధినేని రాజేశ్వరి మధ్యాహ్న భోజనం ప్లేట్లు అందించాలన్న ఆలోచన మేరకు వాటిని పంపించారు. గురువారం ఎంఈవో అప్పాజీ, పాఠశాల ఉపాధ్యాయులు ఉడతా వెంకటేశ్వరరావు, వాసా దుర్గాప్రసాద్ విద్యార్థులకు అందించారు.



చింతలూరు ఎంపీపీ స్కూల్‌లో భోజనం ప్లేట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



పసలపూడిలో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం పసలపూడిలో సభ్యత్వ నమోదును పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 12 గ్రామాల్లో 8వేల సభ్యత్వాలు పూర్తయ్యాయని త్వరితగతిన మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యాన్ని పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

మరో అల్పపీడనంతో తీరంలో అలజడి



ఓడలరేవులో ఎగిసిపడుతున్న సముద్ర కెరటాలు

అల్లవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడగా అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం సముద్రతీరంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. ప్రతికూల వాతావరణంతో తీరంలో అలజడి కొనసాగుతోంది. అలల ఉధృతి పెరిగితే తీరభూమి మరింత కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. వాతావరణంలో నెలకొన్నమార్పుల దృష్ట్యా సార్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

ముమ్మిడివరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం మర్లపాలెం పంచాయతీ పరిధిలోని కాశివారిపేటకు చెందిన ఖననం చేసిన వ్యక్తి మృతదేహానికి గురువారం ముమ్మిడివరం పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. మర్లపాలెం పంచాయతీ కాశివారిపేటకు చెందిన కాశి సత్యనారాయణ (45) గత ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పేర్కొంటూ కుటుంబ సభ్యులు అతని మృతదేహాన్ని సోమవారం మృతి చెందారు. కాశి సత్యనారాయణ సోదరుడు బాలయోగి తన సోదరుడు సత్యనారాయణది ఆత్మహత్యకాదని హత్య అని, అతని మృతిపై పలు అనుమానాలు వ్యక్తంచేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్‌లు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులు, బంధువులు, భార్య విజయకుమారిలను పోలీసులు విచారించారు. మండల మేజిస్ట్రేట్, తహశీల్దార్ ఎం.సుబ్బలక్ష్మి సమక్షంలో శవపంచనామా నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు గోపీచంద్, వెంకటరమణలు, నగర పంచాయతీ వైద్య సిబ్బంది, పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. సత్యనారాయణకు భార్య విజయకుమారి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.



పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేస్తున్న మృతదేహం